



ప్రభుత్వ భూమి చుట్టూ గోడ ఆ మధ్యలో ఒకరికి పట్టా?

◆ చినగదిలి మండల రెవెన్యూ లీలలు

- 118 సర్వేలో పలు ఎకరాలో అనేక గెడ్డలు మాయం
- స్థానిక నేతల హస్తం
- ప్రభుత్వ భూమి 118లో ఇచ్చిన పట్టా రద్దు చేసి రైతు బజారు ఏర్పాటు చేయాలంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదు



ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

'తిమ్మిని బమ్మిని చేయగల సత్తా ఎవరికుంటుంది? అంటే ఎవరైనా 'రెవెన్యూ' అని చెప్పడం తెలిసిందే. నగరంలోని రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్‌లో గెడ్డలను, ప్రభుత్వ భూములను మాయం చేసిన ఘనత ఏ పార్టీ అధికారంలో ఉంటే వారిదే అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. సుమారు ఎకరా ప్రభుత్వ స్థలం చుట్టూ గోడ నిర్మించి ఉండగా ఆ మధ్యలో ఒక ప్రబుద్ధుడికి పట్టా ఇవ్వడం సాగర్‌నగర్‌లో మోర్ ఎదురుగా సర్వే నెంబర్118లో చోటుచేసుకుంది. గత ప్రభుత్వంలోనే ఇది జరిగినా వైసిపి స్థానిక నేతలు కుమ్మక్కు కావడంతో ఈ వ్యవహారం ఇప్పటివరకూ బయటకు రాకపోవడం విశేషం. రూ.లక్షలు విలువైన ఈ స్థలం పూర్తిగా ప్రభుత్వ భూమి. గోడమీద ఒక చోట్ల రెవెన్యూ బోర్డును రాయించి మరో చోట్ల ఒక వ్యక్తికి పట్టా కూడా రాసిచ్చేయడం పెద్ద కోణంగా వ్యవహారం. ఈ భూ వ్యవహారం గత తహశీల్దార్ రమణయ్య వద్దకు గతంలో బాధితులు వెళ్లగా ఆయన కబ్జా చేసిన వారి తరఫునే నిలబడడం ఇక్కడ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సర్వే నెంబరు 62లో తాజాగా అధికార వైసిపి నాయకుడు లగ్గర్ అపార్టుమెంట్ల నిర్మాణం చేస్తున్న విషయం తెలిసిందే. దీంట్లో కొంత గెడ్డ భాగం కలిసి ఉందని ఫిర్యాదులు గత తహశీల్దార్‌కు వెళ్లగా సర్వేయర్లతో సర్వే చేయించిన సదరు రమణయ్య సర్వేయరు ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. గెడ్డ ఉందని నివేదించిన చూసీచూడనట్టు వ్యవహరించడం మరో ప్రత్యేకత.

ఆ రెండు పార్టీలూ దొందూ దొందే...

భూ కబ్జాల్లో అటు తెలుగుదేశం, ఇటు వైసిపి రెండూ భాయీ భాయీ అంటూ పంపకాలతో పబ్బం గడుపుకుంటున్నాయి. ఎండాడ సర్వే నెంబర్61లోనూ ఇలాంటి కబ్జాలకు వైసిపి పాల్పడితే పలువురికి ఈ భూములను అమ్మేశారు. ఆ తర్వాత రెవెన్యూ వాళ్లు వచ్చి వాటిలో బోర్డులు పెట్టేయడంతో కొనుక్కున్న ప్రజలు తాము మోసపోయామని గుర్తించిన ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ఇలాంటి వారంతా రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రుషికొండలోనూ పలు భూములను అధికార పార్టీ నేత ఒకరు కబ్జా చేశారు. సర్వే నెంబరు 29/2లో జిరాయితీని కొంత కొనుగోలు చేసిన సదరు అధికార పార్టీ నేత 29/1లోని 4.90 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. ఫెయిర్ అడంగల్, ఎండిఆర్ రికార్డులు పరిశీలిస్తే ఈ కబ్జా బయటపడే అవకాశం ఉన్నా రెవెన్యూ కాసుల వేటలో పడి ఈ పని వదిలేసింది. గత తహశీల్దార్ చేయించిన సర్వేలన్నీ రెవెన్యూ ప్రయోజనాలను కాలరాశాయన్నది తాజాగా రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం లోలోపల చెబుతున్నారు. సర్వే నెంబర్ 67లో నుంచి వచ్చే గెడ్డలేమయ్యాయి? 118లో పలు ఎకరాల ప్రభుత్వ భూమి ఏమైంది. గతంలో 14 మందికి నోటీసులు ఇచ్చినా ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడంతో కబ్జారాయుళ్ళు రెచ్చిపోతున్నారు.

ప్రభుత్వ భూమిలో గోడ ఉన్నా పట్టాపై చర్య!

సాగర్‌నగర్‌లోని 118 సర్వే నెంబరులో ఎకరాకు పైగా స్థలం చుట్టూ గల గోడ నిర్మాణం అందులో ఒకరికి పట్టా ఇచ్చిన వైనంపై ఈ ప్రాంతంలో తాజాగా చర్చ జరుగుతోంది. దీనిపై జివిఎంసిలో ఈ ప్రాంత సామాజిక కార్యకర్త ఫిర్యాదు చేయడంతో వ్యవహారం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక్కడే రైతు బజారు పెట్టాలన్న ప్రతిపాదన కూడా స్థానికులు చేస్తున్నారు. దీని ఎదురుగానే రోడ్డుపై రైతులతో దూర ప్రాంతాల నుంచి వచ్చి కూరగాయాలను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ భూమి ఎదురుగా కనిపిస్తున్నా అది కబ్జా కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి. వీరు చెబుతున్న ప్రకారం ఆ భూమిని రెవెన్యూ ఖాళీ చేయించి అందులో పట్టా పొందిన వ్యక్తికి వేరోక చోట ఇవ్వాలన్న డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలే రెవెన్యూ అధికారిగా బాధ్యతలు తీసుకున్న వారు ఈ పనిచేయాలని స్థానిక ప్రజలు సహా కూరగాయల రైతులు సైతం జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

అక్రమంగా రొయ్యల చెరువులు

లైసెన్సులు లేకుండా సాగు

ప్రజాశక్తి–అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో అక్రమంగా రొయ్యల సాగు యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వి ఉప్పునీటి రొయ్యలు సాగుచేస్తున్నారు. ఇది కొన్నేళ్ల నుంచి సాగుతున్నా సంబంధిత అధికారులెవరూ చర్యలు తీసుకోవడంలేదు. జిల్లాలోని 1400 ఎకరాల్లో రొయ్యల చెరువులున్నాయి. వీటిలో 900 ఎకరాల్లోని రొయ్యలు సాగుచేస్తున్న చెరువులకు అనుమతులున్నాయి. మిగిలిన 500 ఎకరాల చెరువులకు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ(చైన్నై) నుంచి లైసెన్సులు లేవు. అయినా రొయ్యలు సాగు ఆపడంలేదు. తీరప్రాంత మండలాలు పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడలో రొయ్యల సాగు అధికంగా ఉంది. అధిక లాభాలు గడిస్తున్న యజమానులు, లైసెన్సు తీసుకోవాలన్న నిబంధనలు పాటించడంలేదు. రొయ్యల సాగు చేయడానికి సొంత భూమి, లేదా లీజుకు తీసుకొని ఉండాలి. ఉప్పు నీటి సౌకర్యం చూపించాలి. వ్యవసాయ పొలాలకు 50 మీటర్ల దూరంలో ఈ చెరువులు ఏర్పాటు చేసుకోవాలి. మంచినీటి వనరులకు వంద మీటర్లలోపు చెరువులు తవ్వకూడదు. పంట పొలాల్లోకి మురుగునీరు పోకుండా రొయ్యల చెరువులు చుట్టూ మురుగునీటి వ్యవస్థను ఏర్పాటుచేయాలి. రొయ్యల చెరువుల సాగులో ఈ నిబంధనలన్నీ పాటించినట్లు మండల, జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపిన తరువాత ఆక్వా కల్చర్ అథారిటీ లైసెన్సు మంజూరుచేస్తోంది. రొయ్యల చెరువుల సాగులో నిబంధనలు అమలుచేయని యజమానులు లైసెన్సులు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. లైసెన్సు లేకుండా సాగు చేయకూడదని తెలిసినా, చర్యల్లేకుండా వివిధ స్థాయిల్లో వారు సర్దుబాటు చేసుకోగలుగుతున్నారు. ఐదేళ్లకు ఒకసారి లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాల్సివుంది. కొంతమంది యజమానులు ఏళ్ల తరబడి సాగుచేస్తున్నా, లైసెన్సులు మాత్రం తీసుకోవడంలేదు. లైసెన్సుల కోసం అధికారులు ఒత్తిడితెస్తే కొత్తగా లీజుకు తీసుకున్నామంటూ తప్పించుకుంటున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్సు తీసుకొని రొయ్యల సాగుచేయాలని యాజమానులకు ఇప్పటికే సూచించామని అధికారులు చెబుతున్నారు.



రైతు భరోసా విడుదల

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖపట్నం : వైఎస్ఆర్ రైతు భరోసా – పిఎం కిసాన్ పథకంలో భాగంగా విశాఖ జిల్లా నుంచి 28,461 మంది రైతులు ఆర్థిక ప్రయోజనం పొందారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐదో ఏట మూడో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా విశాఖపట్టణం జిల్లాకు చెందిన రైతుల ఖాతాల్లో రూ.5.70 కోట్ల నిధులను జమ చేశారు. వైఎస్ఆర్ సున్నావడ్డీ పంట రుణాల కింద రూ.32.51 లక్షలను సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశారు.

కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన రైతులు, ఇతర అధికారులతో పాటు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం రైతు భరోసా, వైఎస్ఆర్ సున్నావడ్డీ పంట రుణాలకు సంబంధించిన నమూన చెక్కులను కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, ఉద్యాన శాఖ అధికారి మన్మధరావు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లాలో 2,65,886 మంది రైతులకు రూ.53 కోట్ల 32లక్షలు 5వ విడత వై.ఎస్.ఆర్. రైతు భరోసా, 36,643 మందికి 6 కోట్ల, 90 లక్షల36 వేలు వైఎస్ఆర్ సున్నా వడ్డీ జమ చేసినట్లు జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టరు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తదితరులు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మోహనరావు, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పాడేరు: రైతు భరోసా, సున్నా వడ్డి రాయితీ కింద అల్లూరి జిల్లాలో 1.73 లక్షల మంది రైతులకు రూ.35.27 కోట్లు లబ్ది చేకూరిందని జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట తెలిపారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి 1119 మంది రైతులకు రూ. 22.97 లక్షలు, ఖరీఫ్ 2022 సంవత్సరానికి సంబంధించిన 2133 మంది రైతులకు రూ.43.78 లక్షలను సున్నా వడ్డీని ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, సహాయ సంచాలకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



రైతులకు చెక్కును అందిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి : కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి–విశాఖపట్నం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ని కచ్చితంగా అమలు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంసిసి అమల్లో నిర్లక్ష్యం వహించినా, ఉపేక్షించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఖర్చుల లెక్కింపు తదితర అంశాలపై ఎంసిసి బృందాలు, ఎఇఆర్ఒలు, వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, పోలీసు అధికారులు, వీడియో, ఇతర సిబ్బందికి బుధవారం డా చిల్డ్రన్స్ ఎరీనాలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. నోటిఫికేషన్ జారీ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎంసిసి అమల్లో ఉంటుందని, ఈ క్రమంలో భారత ఎన్నికల సంఘం అధీనంలోనే పనిచేస్తారన్న విషయాన్ని ప్రతి అధికారీ గుర్తెరగాలని హితవు పలికారు. ప్రతి అధికారీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం విడనాడి, అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లిప్తత ప్రదర్శించినా, ఎన్నికల కమిషన్ నుంచి కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి అధికారీ నిష్పక్షపాతంగా విధులను నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ కొత్తగా విడుదల చేసిన హేండ్‌బుక్‌లో ఉన్న అంశాలపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి–అనకాపల్లి : సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్, ఎంటిఎస్ అమలు, డైరెక్ట్ పేమెంట్ తదితర సమస్యలపై విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మార్చి 3న ఉదయం 10 గంటల నుండి జరిగే మహాగర్జనలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్టమ్, గెస్ట్, పీస్‌రేట్ ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి అనకాపల్లి జిల్లా కన్వీనర్ వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహాగర్జనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పై హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నేత ఆర్ శంకర్రావు, డివైఎఫ్ఐ నేత సిహెచ్. శివాజీ పాల్గొన్నారు.

ఓట్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి –అనకాపల్లి : జిల్లాలో ఓటర్లందరూ ఓట్ యాప్‌ను తమ మొబైల్ ఫోన్, కంప్యూటర్లలో డౌన్ లోడ్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిక్ కార్డును కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఎన్నికల నామినేషన్ దఖలు చివరిరోజుకు 10 రోజుల ముందు వరకు ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశరలో డి.రామ్మూర్తి, డిటి కె.రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొల్లి రావు, పి.నాగేశ్వరరావు, ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి –కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్‌లో రక్తహీనతపై తాళ్ళపాలెం పిహెచ్‌సి ఆధ్వర్యాన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ ఆదికారి ఎంఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ రక్త హీనత రాకుండా కూరగాయాలు, బెల్లం, ఎండు ద్రాక్ష పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషారత్నం, ఎంపిహెచ్ఎస్ నరిసింహాలు, ఆర్‌వి లక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు రోజులు ఓపిక పట్టండి

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి నియోజకవర్గ శ్రేణులు మరో రెండు మూడు రోజులు ఓపిక పట్టాలని, వైసిపి రెచ్చగొట్టే ధోరణులకు ప్రభావితం కావద్దని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గవరపాలెంలోని తన కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు చంద్రబాబు సూచన మేరకు మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉందన్నారు. టికెట్టు జనసేనకు వెళ్ళిన తర్వాత చంద్రబాబును అయ్యన్నపాత్రుడుతో కలసి కలవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిఎస్ఎంకే జోగినాయుడు, పచ్చికూర రాము, కర్రి బాబీ, అక్కిరెడ్డి రమణబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి–అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మార్చి 7వ తేదీన అనకాపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం పరిశీలించారు. పిసినికాడ సమీపంలోని ఒక స్థలాన్ని, డిమార్ట్ సమీపంలోని మరొక స్థలాన్ని మంత్రి అమర్నాథ్, కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్పీ మురళి కృష్ణ తదితరులు పరిశీలించారు. హెలిపాడ్ కోసం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం, కసింకోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణను పరిశీలించారు. రోడ్ షోకు అనువైన మార్గాన్ని కూడా మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీ బివి.సత్యవతి, వైసిపి నాయకులు బొడ్డెడ ప్రసాద్, మలసాల భరత్ కుమార్, దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి–కశింకోట : మార్చి 3న జరుగు పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కసింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు కోరారు. ఈ మేరకు పిహెచ్‌సిలో బుధవారం పోలియోపై సమావేశం నిర్వహించారు.

రైల్వేజోన్ భూములపై బిజెపి, వైసిపి నాటకాలు

సిపిఎం నేతలు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖ రైల్వేజోన్‌కు భూముల కేటాయింపుపై బిజెపి, వైసిపి ప్రభుత్వాలు నాటకాలడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. రైల్వే జోన్‌కు భూములు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా, ఇవ్వలేదని బిజెపి మాట్లాడడమంటే ప్రజలను గందరగోళపర్చి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. తాజాగా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రైల్వేజోన్‌కు అవసరమైన అన్ని చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకొని నిధులు విడుదల చేసినట్లు చెప్పడంలో ప్రజలను మోసగించడమేనని పేర్కొన్నారు. 5ఏళ్ళ వరకు రైల్వేజోన్ ఊసెత్తని బిజెపి ఎన్నికల ముందు రైల్వేజోన్ ఏర్పాటు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం భూమిలిచ్చి సహకరించడం లేదని చెప్పడం వెనుక తమ రాజకీయ లబ్ధి తప్ప ప్రజలకు మేలుచేసేది లేదని తెలిపారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా మోడీ ప్రభుత్వం అమలు చేయలేదని, అమలుచేయని కేంద్ర బిజెపి పై రాష్ట్ర వైసిపి ప్రభుత్వం కనీసం ఒత్తిడి చేయలేదని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి రాష్ట్రానికి మేలుచేయకపోవగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, ప్లాంట్ భూములను ముక్క ముక్కలు చేసి అమ్మకానికి పెడుతున్నా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కనీసం నోరుమెదపకపోవడం దుర్మార్గమన్నారు. అన్యాయానికి గురౌతున్న రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులు, బిజెపి, వైసిపిలకు, వాటికి వంత పాడే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

ఎమ్మెల్యే ధర్మశ్రీకి గుణపాఠం చెప్పాలి

ప్రజాశక్తి–వడ్డాది : ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చర్చలకని విశాఖపట్నం పిలిపించి వడ్డాది పిఎసిఎస్ అధ్యక్షుడు సన్యాసిరావుపై వ్యక్తిగత దూషణలతో పాటు చేయి చేసుకున్నారని పలువురు నాయకులు ఆరోపించారు. బుధవారం వడ్డాదిలో గ్రామ పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అవినీతికి కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే ధర్మశ్రీ అని ఆరోపించారు. ఎంతో రాజకీయ చరిత్ర కలిగిన గ్రామస్థాయి లీడర్ సన్యాసిరావుపై ఎమ్మెల్యే చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే ఎమ్మెల్యే ధర్మశ్రీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అధిష్టానం సీటు కేటాయించిన ఆయన వెంట తిరిగేది లేదని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా సన్యాసిరావుకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ దొండా కన్నబాబు, స్థానిక సర్పంచ్ భర్త కోరుకొండ సూరప్పారావు, ఉపసర్పంచ్ దాడి సూరినాగేశ్వరావు, జనసేన నాయకులు అడపా నరసింహమూర్తి, సయ్యపురెడ్డి నవీన్, టిడిపి నేతలు దొండా నరేష్, శ్రీను, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోవర్టులను సస్పెండ్ చేయాలని వినతి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ఆరు మాసాల తర్వాత పార్టీలో చేరిన ఆ ముగ్గురు కోవర్టులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బుచ్చయ్యపేట మండలం వైసిపి నాయకులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారు కొంతమంది అక్రమాలకు పాల్పడడానికి ప్రయత్నిస్తున్నారని, వారి ఆటలు సాగకపోవడంతో పార్టీలో విభేదాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దొండ నారాయణమూర్తి, కోవెల జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి రూ.కోటి సిజిఎఫ్ నిధులు మంజూరు

ప్రజాశక్తి –అనకాపల్లి : అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో శిధిలావస్థలో వున్న క్యూ – కాంప్లెక్స్, మండపం పునర్నిర్మాణం నిమిత్తం సిజిఎఫ్ నిధుల నుండి కోటి రూపాయిల గ్రాంట్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం సిజిఎఫ్ నిధులు ఇప్పించాలిసిందిగా రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాధ్‌ని దేవస్థానం చైర్మన్, ఈఓ, పాలకమండలి సభ్యులు కోరారు. వెంటనే స్పందించి దేవదాయ ధర్మదాయ శాఖామాత్యులు కొట్టు సత్యనారాయణకి, కమిషనర్ ఎస్.సత్యనారాయణకి సిఫార్సు చేయగానే ప్రతిస్పందించి అమ్మవారి దేవస్థానం నుండి మాచింగ్ గ్రాంట్‌గా 60 లక్షలు జోడించి మొత్తం 1కోటి 60 లక్షలు ఎస్టిమేటెడ్ నిధులను మంజూరు చేశారు. దీంతో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈఓ, సహాయ కమీషనర్ బండారు ప్రసాద్ మంత్రి గుడివాడ అమర్నాధ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటర్ హాల్ టికెట్లు నిరాకరిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి–అనకాపల్లి : ఫీజులు బకాయిలు, హాజరు సరిపడలేదన్న సాకుతో రాష్ట్రంలోని ఏ ఒక్క ఇంటర్మీడియట్ విద్యార్థికైనా హాల్ టికెట్ నిరాకరించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత కార్పొరేట్, ప్రైవేటు కళాశాల గుర్తింపు రద్దుతో పాటు ఆయా యాజమాన్యాలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసేలా సిఫారసులు చేస్తామని ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రత్యేక వెబ్సైట్ ద్వారా నేరుగా హాల్ టికెట్లు జారీ ప్రక్రియ ప్రారంభించిందని, దీనిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తే apscpcr2018@gmail.com మెయిల్‌కు ఫిర్యాదు పంపించాలని కోరారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి–రాంబిల్లి : ఉపాధి హామీ పనులను కూలీలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రం రాంబిల్లిలో ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంను నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 30 పంచాయతీలలో 814 పనులకు సంబంధించి రూ.7కోట్లుతో చేసిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి ఇ.సందీప్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నిర్వహణలో సమన్వయం ఉండాలి

ప్రజాశక్తి–అనకాపల్లి : అధికారులు ఎన్నికల విధుల నిర్వహణలో నిబద్ధత, సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల శిక్షకులు పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి.జయంతి చెప్పారు. బుధవారం కలెక్టరు కార్యాలయంలో జిల్లాలోని అధికారులకు నిర్వహించిన శిక్షణా తరగతులలో ఆమె మాట్లాడుతూ చిన్న పొరపాటుకు కూడా అవకాశమీయకుండా పూర్తి పారదర్శకంగా పని చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.


వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి భరత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి –అనకాపల్లి : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధంచాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అన్ని జిల్లాల నియోజక వర్గాల ఇంఛార్జిలకు వినతిపత్రం అందజేసే కార్యక్రమంలో భాగంగా వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భారత్‌కి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నాబ్బాయ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. రాబోయే ఎన్నికల్లో విడుదల చేసే మేనిఫెస్టోలో సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఇచ్చే అంశాన్ని చేర్చాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు, జిఎస్ ప్రకాష్, వైరాల రమేశ్ రావు, ఆశ, స్వామి, సలీం పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ఇళ్ల స్థలాలిస్తే ఎవరు నిర్మిస్తారు?

ప్రజాశక్తి–దేవరాపల్లి : శ్మశాన వాటికలో ఇళ్ల స్థలాలు ఇస్తే అక్కడ ఇళ్లు ఎవరు నిర్మిస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర ప్రశ్నించారు. మండలంలోని మారేపల్లి గ్రామంలో దాదాపు 16 కుటుంబాలకు ప్రభుత్వం జగనన్న కాలనీ కింద మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను బుధవారం వారు పరిశీలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, బోరు, మంచినీటి కుళాయిలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించిన ఆ స్థలాల్లో లబ్ధిదారులు ఎవరూ ఇళ్ల నిర్మాణం చేయకపోవడంపై లబ్ధిదారులను ఆరా తీశారు. శ్మశాన వాటికలో స్థలాలు ఇస్తే ఇల్లు ఎలా నిర్మించుకుంటామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న, దొర మాట్లాడుతూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం కోసమే స్థలాలు ఇచ్చిందన్నారు. ప్రజాధనం వృధా చేశారు తప్ప ప్రజలకు ఉపయోగపడలేదని పేర్కొన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేరోజులు దగ్గర పడ్డాయని వారు స్పష్టం చేశారు.

టిడిపి, జనసేన నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి–చోడవరం : బుచ్చయ్యపేట మండలం మల్లం గ్రామానికి చెందిన టిడిపి, జనసేన పార్టీల నుంచి ముప్వల దేముడు, బొట్ట చిన్నతల్లితో పాటు పది కుటుంబాలు బుధవారం వైసిపిలో చేరారు. చోడవరం వైసిపి కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మల్లం సర్పంచ్ శివ, గోలగాన లోవరాజు, అప్పారావు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి–కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులోని గౌరీ పరమేశ్వరుల ఆలయం 8వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం గౌరీ పరమేశ్వరుల సారి ఊరేగింపు నిర్వహించారు. గౌరీ సంఘం గౌరవ అధ్యక్షులు శరగడం సన్యాసినాయుడు, యువకులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి జనసేన నేత విరాళం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి రూ.10వేలు, మర్రిపాలెంలో ఎల్లుపమ్మ ఆలయ నిర్మాణానికి రూ.15వేలు విరాళాలను జనసేన జిల్లా నాయకులు బలిరెడ్డి అప్పారావు బుధవారం అందజేశారు.

మండలంలోని సబ్బవరం పంచాయితీ శివారు గణపతిపురంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన జనసేన జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు పాల్గొని, పంచకర్ల రమేష్ బాబు తరపున లక్ష రూపాయలు విరాళం అందజేశారు.

మురుగు సమస్యకు తాత్కాలిక పరిష్కారం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



దోమల నివారణ చల్లుతున్న మలేరియా సిబ్బంది

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు మరిడిమాంబ కాలనీలో మురుగు, దోమల సమస్యను సంబంధిత అధికారులు తాత్కాలిక పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ నెల 21న 'డ్రైనేజీ వ్యవస్థ ఏదీ?' శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించిన జివిఎంసి యంత్రాంగం ఆదేశాల మేరకు మలేరియా ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు ఆధ్వర్యంలో మురుగునీరు మళ్లీ పోయేందుకు తాత్కాలికంగా చిన్న కాలువ ఏర్పాటు చేశారు. దోమల నివారణకు బ్లీచింగ్ చల్లడంతోపాటు దోమల నివారణ పిచికారీ చేశారు. ప్రజాశక్తి కథనానికి అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని మరిడిమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గున్నమ్మ, గౌరునాయుడు రమణ కోరారు.

వాకర్స్‌తో ఎమ్మెల్యే వెలగపూడి భేటీ

ప్రజాశక్తి - ఆరిలోవ : తూర్పు నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీచేయనున్న ప్రస్తుత ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం ఉదయం 13వ వార్డు ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకర్స్ సభ్యులు కలుపుతో సత్కరించారు. వాకర్స్‌కు వాలీబాల్ గ్రౌండ్, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసిన వెలగపూడికి అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, సెక్రటరీ ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ ఆరిలోవ హెల్త్‌సిటీలో 2.84 ఎకరాల స్థలాన్ని ఇండోర్ స్టేడియానికి కేటాయించామని,తమ ప్రభుత్వం రాగానే ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవింద, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, మూగిద రాజారావు, రాగతి అచ్యుతరావు, బాసస్వామి ఉన్నారు.

చేతి వృత్తులను ప్రోత్సాహించండి

ప్రజాశక్తి- కరాస: చేతివృత్తుల కళాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు బుధవారం ఎన్ఎడి జంక్షన్, సుబ్రహ్మణ్యస్వామి గుడి ప్రక్కన హస్తకళలు,చేనేత వస్తువుల ప్రదర్శన, ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజారును సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబుతో కలిసి ప్రారంభించారు. నెలరోజులు పాటు, 22 రాష్ట్రాలకు చెందిన చేతివృత్తిదారుల ఉత్పత్తులు, హస్తకళలతోకూడిన క్రాఫ్ట్ బజారును వినియోగదారులు సద్వినియోగం చేసుకుని, చేతి వృత్తులను ప్రోత్సాహించాలని కోరారు.

రవాణా కార్యాలయంలో ఆర్ఒ ప్లాంట్

ప్రజాశక్తి- తగరపువలస: ఆనందపురం మండలం, గంభీరం రవాణా శాఖ కార్యాలయంలో చిప్పాడ, దివిస్ ల్యాబొరేటరీ సిఎస్ఆర్ నిధులు రూ.13.70లక్షలతో నిర్మించిన ఆర్ఒ ప్లాంట్‌ను రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ సుందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దివిస్ సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. దివిస్ సంక్షేమ అధికారి ఎం విజయభాస్కర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ జిసి రాజారత్నం, ఆర్టీఓ రామ్‌కుమార్, ఎంవిఐలు వి వేణుగోపాల్, బి బాలాజీరావు, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు క్రాంతికుమార్, శ్రీనివాస్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

నెల రోజుల్లోనే తహశీల్దార్ బదిలీ

ప్రజాశక్తి-పద్మనాభం : ఇటీవల ఎన్నికల బదిలీల్లో భాగంగా పద్మనాభం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సిహెచ్. బంగారురాజును నెలరోజులు తిరక్కుండానే మళ్లీ పెందుర్తికి బదిలీ చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం నుంచి బంగారురాజు ఇక్కడకు వచ్చారు. సొంత నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వరాదన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బంగారురాజును అనివార్యంగా బదిలీ చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోట కు చెందిన బంగారురాజు, విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలోకి వస్తుండడంతో, ఆయనను పద్మనాభం నుంచి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పెందుర్తికి బదిలీ చేశారు. పెందుర్తిలో పనిచేస్తున్న వెంకటరావును పద్మనాభం తహశీల్దార్‌గా నియమించారు.



మాట్లాడున్న డిఎస్‌పి సుబ్బరాజు

డిఎస్‌పి ఆధ్వర్యంలో సెర్చ్ ఆపరేషన్

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని రత్నంపేట గ్రామంలో బుధవారం జిల్లా డిఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు సెర్చ్ ఆపరేషన్‌ను 120 మంది పోలీసులతో నిర్వహించారు. గ్రామంలో రికార్డులు సరిగ్గా లేని మూడు ఆటోలను, కారును, 16 ద్విచక్ర వాహనాలు స్వాదీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. రత్నంపేటలో నాటుసారాకు వినియోగించే పులుపును 1500 లీటర్లను ధ్వంసం చేశామన్నారు. పోలీసులు సెర్చ్ ఆపరేషన్‌లో పట్టుబడ్డ కారు, ఆటోలను, ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఒక వ్యక్తి వద్ద ఐదు లీటర్ల సారా స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సిఐ అప్పలనాయుడు, ఎస్పైలు లక్ష్మణరావు, సురేష్ పాల్గొన్నారు.

సకాలంలో డిపోలకు సరుకులు చేర్చాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:చౌక డిపోలకు ప్రభుత్వం అందజేస్తున్న సరుకులను సకాలంలో చేర్చాలని బుధవారం జోనల్ మేనేజర్ సుబ్బరాజు సూచించారు. గోదాములో ఉన్న సరుకులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తెల్ల రేషన్ కార్డుదారులు అందరికి పూర్తిస్థాయిలో కందిపప్పు అందజేసేందుకు వివిధ ప్రాంతాల్లో కందులు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే డిపోలకు పంచదార, బియ్యం సరఫరా చేసామని తెలిపారు. కార్యక్రమంలో గోదాము ఇంచార్జి సుబాకరరావు,అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్

చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రంగరాజు, శేషగిరిరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు ఉగాది రోజున బహుమతులు అందిస్తామన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి

● సిఐటియు ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -ములగాడ : వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, దాని ద్వారా భవన నిర్మాణ కార్మికులకు పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. పారిశ్రామిక ప్రాంతం 62వ వార్డు త్రినాధపురం, 63వ వార్డు క్రాంతినగర్, చింతల్లోవ ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ సంఘం గౌరవాధ్యక్షులు కె. పెంటారావు, మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారా యణ మాట్లాడుతూ, వైసిపిప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు సంక్షేమ బోర్డు రద్దుచేసి, నిధులన్నీ దారి మళ్లించి, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను దూరం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టకుంటే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. నిరసనలో సంఘం నాయుకులు డి.గోపాల్, మురళీ, పి.సురేష్, నీలయ్య, ఆనందరావు, హరి, రాజు, త్రినాధపురంలో పి.రామారావు, కె.సింహచలం, మడ్డు గణేష్, అప్పయ్య పాల్గొన్నారు.



ఆందోళనలో మాట్లాడుతున్న పెంటారావు

కేన్సర్ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న విమ్స్ వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ: విమ్స్‌లో బుధవారం నిర్వహించిన మెగా కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె రాంబాబు మాట్లాడుతూ విమ్స్‌లో నూతనంగా కేన్సర్ విభాగాలను ప్రారంభించామని, వాటిపై ప్రజలకు అవగాహన, సేవలను చేరువ చేసేందుకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 75మందికి నోరు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం, చర్మం, ఎముకలకు సంబంధించి కేన్సర్ నిర్ధారణకు వైద్యపరీక్షలు చేశామని, ఎంతో ఖరీదైన ఎఫ్ఎన్ఎసి పరీక్షలు ఎనిమిది మందికి, మెమోగ్రం పరీక్షలు 12మందికి, ఇంకా బయాప్సీ వంటి వ్యాధినిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేశామన్నారు. విమ్స్‌లో మెడికల్, సర్జికల్ ఆంకాలజీ రెండు విభాగాల్లో ఇద్దరేసి స్పెషలిస్ట్ వైద్యనిపుణులున్నారన్నారు. ఆసుపత్రి నందు కీమోథెరపీ, మందులు ద్వారా క్యాన్సర్ ను నయం చేసే ఇద్దరు డాక్టర్లు, సర్జరీలు ద్వారా క్యాన్సర్ కణితు లను తొలగించేందుకు మరో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు

బెంగళూరు 'గీతం' ప్రాంగణంలో 'మూర్తి ల్యాబ్స్' ప్రారంభం

ప్రజాశక్తి- మధురవాడ : బెంగళూరులోని గీతం ప్రాంగణంలో మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి ల్యాబ్స్) పరిశోధన కేంద్రాన్ని ప్రముఖ వైమానిక రంగ నిపుణుడు, పద్మశ్రీ, డాక్టర్ కోటా హరినారాయణ, చెన్నైలోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ క్రిస్టోఫర్ డబ్ల్యు. హోడ్జ్‌సలతో కలిసి విసి దయానంద సిద్ధవట్టం బుధవారం ప్రారంభించారు. బెంగళూరు ప్రాంగణంలో మూర్తి పరిశోధన కేంద్రం డ్రోన్ టెక్నాలజీ, సాయిల్ రీసెర్చ్, జియో-స్పేషియల్ రీసెర్చ్, స్మార్ట్ ఎగ్రికల్చర్ రీసెర్చ్, నానో సెన్సార్,ఫొటోనిక్స్ మరియు బయోసెన్సార్ రీసెర్చ్, సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్ రీసెర్చ్,అప్లైడ్ ఎలక్ట్రోమాగ్నటిక్ రీసెర్చ్, 3డి ప్రింటింగ్ డిజైన్ రీసెర్చ్, ఆల్జీబ్రా మరియు జియోమెట్రీ రీసెర్చ్, క్వాంటమ్ ఇన్ఫోకామ్ రీసెర్చ్, నెక్ట్ జనరేషన్ కనెక్టివిటీ వంటి 13అంశాలలో పరిశోధనలు చేపట్టనుందని విసి తెలిపారు. గీతం బెంగళూరు ప్రాంగణం ప్రో విసి ప్రొఫెసర్ కెఎన్ఎస్.ఆచార్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్ నిర్వహణ

ప్రజాశక్తి- సీతమ్మధార: వైసిపి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో సమన్వయకర్త కెకె రాజు బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు నియోజక వర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా విన్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించి, మిగతా సమస్యలకు దరఖాస్తులు స్వీకరించి, త్వరలో పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

గుల్జార్‌కు 'జ్ఞానపీఠ్'పై హర్షం

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రముఖ ఉర్దూ కవి, బాలీవుడ్ చిత్ర దర్శకుడు 90 ఏళ్ల గుల్జార్‌కు 2023 జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి, కేకు కట్ చేశారు. ఫిల్మ్ సొసైటీ.కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో గుల్జార్ దర్శకత్వంలో 1972లో విడుదలై, సంచలనం సష్టించిన కోసిస్ చిత్రాన్ని ప్రదర్శించి, సమీక్షించారు.

ఘనంగా జెవివి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం గాజువాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెవివి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు జెవివి 36ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా చెకుముకి సంబరాలను ఏటా నిర్వహిస్తోందన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె. పరశురామ్, గాజువాక జోన్ అధ్యక్షులు ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ ఆర్టికల్ 15ఎహెచ్ అమలుకు పౌరులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెవివి నేతలు బి.త్రినాధ స్వామి, కె వెంకటరావు, డి.శ్రీనివాసరావు, తులసీరత్నం, కిరణ్మయి పాల్గొన్నారు.

2న టిడ్కో గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి- గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పద్మనాభనగర్ టిడ్కో ఇళ్లను బుధవారం సంబంధిత అధికారులు, వైసిపి నేతలు పరిశీలించారు. మార్చి 2న ఉదయం 8గంటలకు సామూహిక గృహప్రవేశాల నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించి, తగు సూచనలు చేశారు. జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, డిఇఇ ఉమామహేశ్వరి, ఎఇఇ. సత్యనారాయణ, 92వ వార్డు వైసిపి అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు, సాలాపు మారయ్య, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీనివాసరావు, కంపర రామకృష్ణ, గొంతిన నాగరాజు, గొంతిన జగదీష్, అభిరామ్, సాలాపు రమణ, అట్ట శంకర్ పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నాలుగో వార్డు జెవి అగ్రహారం శివారు ప్రాంతంలో జివిఎంసి నిధులతో తాగునీటి బోరు, అనుసంధానంగా ఏర్పాటు చేసిన కుళాయిని వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- పద్మనాభం :టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై పద్మనాభం మండలంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. విశాఖ పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జి శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ రాజబాబు ఆదేశాలతో పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను అతికిస్తూ, కరపత్రాలను పంచుతూ ఆటోల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -ఆనందపురం : శొంఠ్యాంలోని ఎన్ఎస్ఆర్ఐటి కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన కణమాంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. 52మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో పరిశుభ్రతా పనులు చేపట్టారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించారు. ప్రజలకు, పాఠశాల, సచివాలయ సిబ్బందికి జనపనార సంచులను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ పిఒ హరగోపాల్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మధురవాడ :మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి చంద్రంపాలెం ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్, దుర్గానగర్, కృష్ణానగర్, పోర్టు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పరిహారం చెల్లించే వరకూ... భూముల జోలికి రావద్దు

పనులు అడ్డగించిన నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించే వరకు భూముల జోలికి రావద్దని నిర్వాసితులు, నాయకులు స్పష్టం చేసారు. మండలంలోని బుచ్చిరాజుపేట కొత్తూరులో ఏపీఐఐసీ అధికారులు సేకరించిన భూముల్లో బుధవారం జెసిబితో జంగెల్ క్లియరెన్స్ పనులను సర్పంచ్ కాళ్ళ శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు అడ్డగించారు. సమస్యలు పరిష్కరించకుండా పనులు చేపట్టడం ఏమిటని అధికారులను నిలదీశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పరిహారం, ప్యాకేజీ, ఇతర సమస్యలపై నిర్వాసితులు అనేక వినతులు ఇవ్వడం జరిగిందని, ఇవేమీ పరిష్కరించకుండా భూములలో పనులు చేపట్టడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు.భూ సేకరణ సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని,18 సంవత్సరాలు నిండిన ప్రతి నిర్వాసితులకు రూ.15లక్షలు, ఇళ్ళు కోల్పోతున్న వారికి 25 లక్షలు ప్యాకేజీ, గ్రామ సభల్లో ఇచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు భూములలో ఏ విధమైన పనులు చేపట్టవద్దనిస్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాబ్జీ, ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పనులు అడ్డగించిన నిర్వాసితులు, నాయకులు

నాడు నేడుతో పాఠశాలలు అభివృద్ధి : బూడి

ప్రజాశక్తి-నక్కపల్లి:రాష్ట్రంలో నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. బుధవారం ఒక వివాహ వేడుకకు హాజరవుతూ మార్గమధ్యలో మండలంలోని వేంపాడు హైస్కూలును ఆయన సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా పచ్చదనంతో ఉండటంతో ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధికి నోచుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. పాఠశాలలో సైన్స్ డే సంధర్భంగా ప్రదర్శించిన వివిధ సైన్స్ ప్రయోగ పరికరాలను తిలకించారు.



వేంపాడు హై స్కూల్ సందర్శిస్తున్న బూడి

85శాతం జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -కోటవురట్ల: డివిజన్లో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 85శాతం పూర్తయినట్లు ఆర్డీవో వెంకట జయరాం తెలిపారు. బుధవారం ఆయన తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండపల్లి, బికేపల్లి అసైన్డ్ భూములపై ఆరా తీసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో 15,302 కాలనీ ఇల్లు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇంతవరకు 13,112 పూర్తయినట్లు తెలిపారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

30మందికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి-రోలుగుంట:స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని నిండుగొండ గ్రామంలో బుధవారం సిబిఎస్ రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో భాగంగా 30 మందికి రక్త పరీక్షలు చేశారు. అనంతరం కౌన్సిలర్ మలసాల గణేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శోభ, ఎంఎల్‌హెచ్‌పీ లోవలక్ష్మీ, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, తదితరలుఉ పాల్గొన్నారు.



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్. నాగాపురం గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన 10 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరందరికి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ, వైసిపి పాలనలో రాష్ట్రం చాలా నష్టపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, సిహెచ్.నాగాపురం మాజీ సర్పంచ్ రామారావు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన నేతలు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక వీవర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన విగ్నేశ్వర ఆలయంలో బుధవారం మూలమూర్తుల విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉపమాక వెంకన్న ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, వేదపండితులు పీసపాటి శేషాచార్యులు, కుమారస్వామి శర్మ నేతృత్వంలో ఆలయ ప్రారంభోత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

చేతి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల గ్రామంలో చేతి బోరును ఎంపిటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఎంపీటీసీ నిధులతో చేతి బోరును ఏర్పాటు చేయడం జరిగిందని నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, నాయకులు తాతారావు పాల్గొన్నారు .



ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు


వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఇందిరానగర్ కాలనీవాసులు

ఇందిరానగర్ కాలనీలో రోడ్లు, డ్రైయిన్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్పీకర్ నిర్ణయంతో మాజీగా మారిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సొంత నిధులతో 42వ వార్డు పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా దర్బార్‌లో ఇందిరానగర్ ప్రజలు పలుమార్లు కోరిన మేరకు, కాలనీ అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రాంత ప్రజల కష్టాలు తెలిసిన నేతగా తన వంతుగా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాలనీలో ఉన్న ఇళ్లకు పన్నులు విధించడంతోపాటు, రానున్న రోజుల్లో వన్ షాప్ పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ గృహాలను నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అల్ల లీలావతి, అల్ల శ్రీనివాస్, జివిఎంసి కో ఆప్షన్ నెంబర్ షరీఫ్, మాజీ కార్పొరేటర్ బలుసు జగదీష్, సకల భక్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాలో అశ్లీలంపై పోరాటాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గత మూడున్నర దశాబ్దాలకు పైగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ మీడియాలలోని అశ్లీల-అభ్యంతరకర ధోరణులపై ఎన్నో పోరాటాలు జరిపామని అశ్లీలతా ప్రతిఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఈదర గోపీచంద్ చెప్పారు. వాటిలో మొదటి ఘట్టం 1987-94 మధ్య గుంటూరు శేషేంద్ర శర్మ రాసిన అశ్లీల వివాదాస్పద సీరియల్‌పై జరిగిన న్యాయ - సాహితీ పోరాటమని, ఈ పోరాట చరిత్రను ఇటీవలే "కామోత్సవ దహనం" పేరిట పుస్తకంగా వెలువరించామని తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం టీవీలో, సామాజిక మాధ్యమాలలో పెచ్చరిల్లుతున్న అశ్లీల విష సంస్కృతిని, మూఢనమ్మకాలను ప్రభుత్వం అరికట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు నదవ ప్రకాశరావు, తెలుగు దండు ఉద్యమ నేత పరవస్తు ఫణిశయన సూరి, భారత నాస్తిక సమాజం అధ్యక్షులు తుంపాల శ్రీరామమూర్తి, అశ్లీలతా ప్రతిఘటన వేదిక విశాఖ ప్రతినిధి రామారావు రమేష్ బాబు, నాటక కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి వర్రె నాంచారయ్య, చెన్నా మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

'దక్షిణం'లో భారీ మెజార్టీ రావాలి : వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో 60 శాతం ఓటింగ్ ఉన్నప్పటికీ ఉన్న వర్గాల వారిని ఆకర్షించే విధంగా పనిచేయాలని నియోజకవర్గ వైసిపి నేతలకు వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆశీలుమెట్టలోని వాసుపల్లి కార్యాలయంలో బుధవారం దక్షిణ నియోజకవర్గం ముఖ్య నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వార్డుల్లో డోర్ టు డోర్ పర్యటించాలని, అక్కడ లోపాలను సరిదిద్దాలని చెప్పారు. వ్యతిరేకత ఉన్నవాళ్ళ వద్ద మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వారిని కూడా ఆకర్షించాలన్నారు. వార్డుకు 250 మంది పార్టీలో చేరే విధంగా యాక్షన్, నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్లను కలుసుకోవాలన్నారు. గతం కన్నా భారీ మెజార్టీతో వైసిపి జెండా దక్షిణంలో ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, జెసిఎస్ మండల అధ్యక్షులు, ఆలయ చైర్మన్లు, డైరెక్టర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'దక్షిణం' జనసేన అభ్యర్థిగా కందుల నాగరాజు?

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీకి దక్కే వీలుందని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆ పార్టీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. త్వరలోనే టిడిపి, జనసేన పార్టీల ఒప్పందం మేరకు తన పేరు ఖరారు కానుందన్నారు. 36వ వార్డు పరిధి రంగిరీజు వీధిలో బుధవారం నూతన పెళ్లి కుమార్తె యశోదకు బంగారు తాళిబొట్టు, పట్టు చీరను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఏపీ ఆపేందుకుండా జనసేన పార్టీలో చేరానని, అప్పటినుంచి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నానని తెలిపారు. సీటు దక్కితే తన విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పడమటి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, లలిత, హేమ, కందుల కేదార్నాథ్, బద్రీనాథ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు నేడు ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: భారత్ బచావో, జాతీయోద్యమ ఆకాంక్షల సాధన కోసం గురువారం ఉదయం 11 గంటలకు దాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ' ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజు తెలిపారు. ఈ సదస్సుకు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు మణిశంకర్ అయ్యర్, జెడి శీలం, స్వరాజ్ పార్టీ అధినేత యోగేంద్ర యాదవ్, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రాజ్యాంగ హక్కుల రక్షణ కమిటీ కో-కన్వీనర్ కె.విజయరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జై భారత్ నేషనల్ పార్టీ నాయకులు వివి.లక్ష్మీనారాయణ (జెడి), ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, భారత్ బచావో రాష్ట్ర కన్వీనర్ గూడూరు సీతామహాలక్ష్మి లతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు 93 బృందాలు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా 93 రకాల బృందాలను నియమించినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏడేసి బృందాలు పనిచేస్తాయని వాటిలో ఎన్నికల వ్యయం, ఎంసిసి అమలు, వ్యూల, సూక్ష్మ స్థాయి పరిశీలనపరమైన అంశాలపై బృందాలు నిఘా ఉంచుతాయని తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఓటర్ల జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామని, రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను కూడా సమర్థంగా నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ కోరారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు.


2024 ఫిబ్రవరి 28వ తేదీ నాటికి విశాఖ జిల్లాలో ఓటర్ల సంఖ్య 19,62,440గా ఉందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సంఖ్యను అనుసరించి జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఎక్కడైనా ఓటర్ల సంఖ్య 1500 దాటితే ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అనుబంధ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికి సంబంధించి మార్చి 5వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల కేటాయింపు తదితర అంశాలపై వారి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులు అనేక పోరాటాలు చేసి 1996లో సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, దీని తిరిగి పునరుద్ధరించి సంక్షేమ బోర్డు ఫలాలను నిర్మాణ కార్మికులందరికీ అందివ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు కె.నర్సింగరావు ఆధ్వర్యాన రెండో రోజు పవర్ స్టేషన్ ఎదురుగా జవహర్ రోడ్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, సంక్షేమ బోర్డు నుంచి రాష్ట్ర ప్రభుత్వం మళ్లించుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సూరప్పారావు, నాయుడు, మహిళా కార్మికులు నిరసనలో పాల్గొన్నారు.

డాల్ఫిన్ కార్మికుల కేసు విచారణ జాప్యంపై వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డాల్ఫిన్ హోటల్‌లో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులను అక్రమంగా యాజమాన్యం తొలగించిన వ్యవహారంపై, హైకోర్టు ఆదేశించిన మేరకు లేబర్ కోర్టులో ఈ కేసు విచారణ జాప్యం లేకుండా చూస్తామని, ఇందులో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కార్మిక శాఖ అధికారి హామీ ఇచ్చారు. దళిత సంఘాల నాయకులు ఎం.సుబ్బన్న ఆధ్వర్యాన బుధవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ (డిసిఎల్)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్బన్న మీడియాతో మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం డాల్ఫిన్ హోటల్‌లో పనిచేస్తున్న ముగ్గురు దళిత కార్మికులను యాజమాన్యం తొలగించడంతో, ఎసిఎల్ 1 కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. దీనిపై యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించిందన్నారు. విచారణ జరిపిన హైకోర్టు ఈ కేసును కొట్టివేసి కార్మిక శాఖ కోర్టులో తేల్చుకోవాలని చెప్పిందన్నారు. డొమెస్టిక్ ఎంక్వయిరీ చెల్లదని హైకోర్టు చెప్పిందని వివరించారు. డొమెస్టిక్ ఎంక్వయిరీ సక్రమంగా జరిగిందని ఎసిఎల్ చెప్పడం, కేసు విచారణను జాప్యం చేయడానికేనని ఆరోపించారు. దీనికి డిసిఎల్ బదులిస్తూ కేసు విచారణ జాప్యం జరగదని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కె.ఆనందరావు, బూసి వెంకటరావు, ఎ.అప్పారావు, బి.చిరంజీవి, సిఐటియు నాయకుడు కెవిపి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


డిసిఎల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

నేరాలు ఘోరాలు

అనుమానంతో మహిళ హత్య

- పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపల తిమ్మాపురంలో బుధవారం తెల్లవారుజామున మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలివి.

చేపల తిమ్మాపురం గ్రామానికి చెందిన కోడ. రామతల్లి (43) మెడకు నైలాన్ తాడును బిగపెట్టి నగరంలోని అప్పుఘర్, వాసవానిపాలేనికి చెందిన గరికిన దేముడు దారుణంగా హత్య చేశాడు. మృతురాలు రామతల్లితో నిందితుడు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ చేపల తిమ్మాపురంలో రేకుల షెడ్డు అద్దెకు తీసుకుని సహజీవనం సాగిస్తున్నారు. రామతల్లిపై అనుమానంతో దేముడు తరచూ ఆమెను వేధించేవాడు. బుధవారం ఇద్దరి మధ్య వాగ్వివాదం తీవ్రస్థాయికి చేరడంతో కిరాతకంగా హత్య చేశాడు. నిందితుడు నేరాన్ని అంగీకరిస్తూ పోలీసులకు లొంగిపోయాడు.మృతురాలు రామతల్లికి కోడ నూకరాజుతో గతంలోనే పెళ్లికాగా, వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. 2020లో నూకరాజు గుండెపోటుతో మృతి అనంతరం దేముడు, రామతల్లి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. నిందితుడు దేముడు భవన నిర్మాణ కార్మికుడు కాగా, హతురాలు రామ తల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో హౌస్ కీపింగ్ చేస్తుండేది.హతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు సిఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. అనకాపల్లికి చెందిన సన్నిధి సన్యాసిరావు (32) బైక్‌పై వివాహ కార్యక్రమానికి కాకినాడ వెళుతుండగా గొడిచెర్ల వద్దకు వచ్చే సరికి ప్రమాదవశాత్తు బైక్ బోల్తా పడటంతో ఆయన రోడ్డుపై పడి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి కిషోర్ తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య లా కాలేజీ మాజీ వీసీ సత్యనారాయణ

మానవ హక్కులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మానవహక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతి కళాశాలలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు దామోదర్ సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం నగరంలోని ఒక కళాశాల విద్యార్థులకు, 'మహిళలు -విద్యార్థులు- మానవహక్కులు' తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు మానవహక్కులపై అవగాహనఉండటం ఎంతో అవసరమన్నారు.

429 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు ఆదర్శనగర్‌లో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 429 మందికి వైద్యపరీక్ష లు చేసి, మందులు పంపిణీ చేశారు..105 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి, కంటి వెలుగులో భాగంగా 34 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు

స్టీల్‌ప్లాంట్‌లో ఉద్రిక్తత



ప్రజాశక్తి -ఉక్కునగరం :స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళ వారం రాత్రి నుంచి అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను పోరాట కమిటీ సభ్యులు ముట్టడించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇడిని అతని కార్యాలయం లోనే నిర్బంధించారు.

పలుచోట్ల టైలర్ల దినోత్సవం


తగరపువలసలో ర్యాలీ చేస్తున్న టైలర్లు

మండలంలోని సింగవరం సమీపాన కళ్యాణదుర్గం వద్ద టైలర్స్ డే వేడుకలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా టైలర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పలివెల శ్రీనివాసరావు, చీడికాడ టైలర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బుచ్చిబాబు, అర్జున్, ప్రతాప్, గౌరవ అధ్యక్షుడు కొండబాబులు, సభ్యులు, పీఠాధిపతి వెంకట దత్తానంద స్వామీజీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తగరపువలస : టైలర్ల దినోత్సవం సందర్భంగా కుట్టు మిషన్ సృష్టికర్త విలియం ఎలియస్ హూవే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస జ్యూట్ మిల్లు కల్యాణ మండపం సభ నిర్వహించారు. అఖిల భారత పద్మశాలి సంఘం కార్యదర్శి కొప్పల రమేష్, పిఎసిఎల్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, టిడిపి నేత టి.సూరిబాబు, టైలర్లు జోగ అప్పారావు, మాదాబత్తుల సాధూరావు, చింతల వెంకటరావు, ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతల సురేష్ పాల్గొన్నారు

అనకాపల్లి : ప్రభుత్వ పథకాలను దర్జీలకు సొసైటీల ద్వారా అందించాలని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంది మహేష్ కోరారు. ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద సీనియర్ టైలర్ కొమ్మనాపల్లి పోతురాజుకు బిఆర్‌టికాలనీకి చెందిన టైలర్ యల్లపు వెంకటరావులను ఘనంగా సత్కరించారు. షేక్ బాబ్జి.కె.ఖగేష్ పాల్గొన్నారు.

చీడికాడ: చీడికాడ శివ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎం బుచ్చిబాబు ఆధ్వర్యంలో

ఎంవిపి కాలనీ : గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన పోర్టు హాస్పిటల్ సమీపంలోని కమ్యూనిటీ హాల్లో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. టైలరింగ్ మిషన్ సృష్టికర్త ఐజాక్ మెరిట్ సింగర్‌కు నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సిహెచ్ యాదగిరిరెడ్డి, కార్యదర్శి సిహెచ్ వేణు, కోశాధికారి సిహెచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : టైలరింగ్ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని టైలర్ల సంఘం మండల అధ్యక్షులు సాంబశివ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అల్లూరి టైలర్ యూనియన్ ఆధ్వర్యంలో టైలర్ దినోత్సవం నిర్వహించారు. టైలరింగ్ మిషన్ కనిపెట్టిన విలియం హెూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టైలర్ల సంఘ సభ్యులు గండేపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులను యూనియన్ నాయకులు కలిసి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారి, పి.సత్యం, గొల్లపల్లి ప్రసాద్, ఈశ్వర్, శ్రీను, రవి, గోపి, సత్యనారాయణ, వీరబాబు, రాంబాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సభ్యులు తాటితూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంధ పాఠశాలను సందర్శించిన సిపి

ప్రజాశక్తి- మధురవాడ : సాగర్ నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం సిపి డాక్టర్ ఎ.రవిశంకర్ సందర్శించారు. విద్యార్థులకు దిశా దివ్యాంగ సురక్ష టోల్ ఫ్రీ నెంబర్ 7337324466 పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థినులతో సిపి ముచ్చటించారు. వీడియోకాల్ , వాయిస్ కాల్, టెక్స్ట్ మెసేజెస్ లేదా వాయిస్ మెసేజెస్ ద్వారా పోలీసులను సంప్రదిస్తే, తక్షణమే లోకల్ పోలీస్‌లను అప్రమత్తం చేసి కమాండ్ బాధితులకు తగిన రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. దివ్యాంగ సురక్ష నెంబర్‌కు ప్రయోగాత్మకంగా ఆశ్రమ పాఠశాల నుంచి కాల్ చేయగా, ఐదు నిమిషాల వ్యవధిలోనే బ్లూకోట్ పోలీసులు అక్కడకు రావడంపై అంధబాలలు హర్షం వ్యక్తం చేశారు.

ఐపిఎల్ మ్యాచ్ ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి -పిఎం పాలెం: వైజాగ్ వేదికగా రెండు ఐపిఎల్ మ్యాచ్‌లు ఖరారు కావడంతో, వాటి నిర్వహణ, వసతులు తదితర ఏర్పాట్లపై ఢిల్లీ క్యాపిటల్స్ ఆపరేషన్స్ టీమ్ సభ్యులు బుధవారం ఎసిఎకార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డిని కలిసి చర్చించారు. అనంతరం పీఎం పాలెం ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. మార్చి 31న చెన్నయ్‌తో, ఏప్రిల్ 3న కొల్‌కత్తాతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఇక్కడ మ్యాచ్‌లు ఆడనుంది. ఎసిఎ సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి, సిఎఫ్ఒ ఎం.నవీన్ కుమార్, గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎంఎస్.కుమార్ పాల్గొన్నారు.

హాల్ టికెట్ నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి- సీతమ్మధార :ఫీజు బకాయిలు, హాజరు సరిపోలేదన్న సాకుతో రాష్ట్రంలో ఎవరికైనా ఇంటర్ హాల్‌టికెట్ నిరాకరిస్తే వెంటనే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు, apscpcr2018 @gmail. com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. సంబంధిత యాజమాన్యాలపై చైర్మన్ కేసలి అప్పారావు ఆధ్వర్యంలో తక్షణ చర్యలు చేపట్టి, విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు. ఇంటర్‌బోర్డు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టిక్కెట్లు పొందే అవకాశం కల్పించిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

రామన్ ఎఫెక్ట్‌ను భారతీయ భౌతికశాస్త్రవేత్త సర్ సివి.రామన్ కనిపెట్టిన రోజున, జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పలువిద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. రామన్‌కు ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.
- (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)


గాజువాక గిరీష్ విద్యానికేతన్‌లో సైన్స్‌డే ఎగ్జిబిషన్

గాజువాక: 76వ వార్డు గాంధీనగర్ గిరీష్ విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ డే వేడుకలను ఎంఇఒ విశ్వనాథం, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ప్రారంభించారు .వాతావరణంలో మార్పులు, నీటిలభ్యత, మొదలైన అంశాలపై విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించి, అభినందించారు. కరస్పాండెంట్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక జోగువానిపాలెం విజ్ఞాన్ హైస్కూల్‌లో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ కౌశిక్ పర్వీన్ ఆధ్వర్యంలో విద్యార్థులు రోబోటిక్ ద్వారా సర్వీసు, వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంటు, ఎలక్ట్రికల్ డ్యాం, గ్లోబల్ వార్మింగ్, స్మార్ట్ హోం స్కానర్ వంటి సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

మధురవాడ: దేశ ఆర్థిక ప్రగతికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు కీలకమైనవని, సైన్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని బార్క్ విశ్రాంత శాస్త్రవేత్త, గీతం వర్సిటీ విశిష్ట ప్రొఫెసర్ బివిఆర్.టాటా అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా గీతంలో సర్ సివి.రామన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్(ఐపిఎ) విశాఖ శాఖ ఆధ్వర్యంలో గీతం విశ్వవిద్యాలయంలో 'క్వాంటమ్ ఇన్ఫర్మేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ' సెమినార్ నిర్వహించారు. నేషనల్ ఫిజికల్ లేబోరేటరి (న్యూఢిల్లీ) డైరక్టర్ ప్రొఫెసర్ అచెంట వేణుగోపాల్, కలకత్తలోని క్వాంటమ్ ఎకోసిస్టమ్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరక్టర్ ప్రొఫెసర్ అరుణ్ కె.పతికీలకోపన్యాసాలు చేసారు. బార్క్ విశ్రాంత శాస్త్రవేత్త ప్రొఫెసర్ రవికుమార్, డాక్టర్ పి.కిరణ్మయి, డాక్టర్ అవిజిత్ భౌమిక్, డాక్టర్ రాహుల్ కుమార్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : ఇసుకతోట అక్షర పాఠశాలలో చిన్నారులు ప్రదర్శించిన ప్రయోగ నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సోలార్ పవర్, పంటల విధానం, గ్రహాలు నడిచే తీరు, రాకట్ ప్రయోగం తదితర నమూనాల గురించి యుకెజి నుంచి 10వ తరగతి విద్యార్థులు వివరించారు. నాగసుధలక్ష్మి ముఖ్య అతిథిగా ప్రదర్శనలను తిలకించారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెందుర్తి : నరవ విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సైన్స్ డే పురస్కరించుకుని సర్ సివి.రామన్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రాజెక్ట్ ఎక్స్‌పో ప్రారంభించారు. కళాశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ పాల్గొన్నారు

భీమునిపట్నం: ప్రభుత్వ డైట్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సివి రామన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, సైన్స్ అధ్యాపకులు సిఎ సోమయాజులు, యు మాణిక్యం నాయుడు, గొట్టేటి రవి, ఎం.మహాలక్ష్మి, ఎస్ త్రినాథరావు పాల్గొన్నారు.

స్థానిక కెజిబివిలో సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను జిసిడిఒ ఖలీషా బేగం ప్రారంభించారు. విద్యార్థినిలు పలు నమూనాలు ప్రదర్శించారు ప్రిన్సిపల్ గంగాకుమారి పాల్గొన్నారు

పద్మనాభం :కృష్ణాపురం కస్తూరిబా విద్యాలయలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ ఆధ్వర్యంలో సైన్స్‌డే నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టులపై పోటీలు నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థిని సుప్రియ, 9వ తరగతి విద్యార్థిని భావన ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ బహుమతులిచ్చారు.

ఆనందపురం : బోయపాలెం ఎస్సార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో హెచ్చం శాంతిచిత్ర పర్యవేక్షణలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

కరాస: ఎన్ఏడి శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఇఒ డి.దివాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్కూల్ ప్రిన్సిపల్ జె.మహేష్,డీన్ టి సురేష్, బి.సోనియా, జి.శ్రీవాణి, బి. సాంబయ్య, ఎల్.లక్ష్మి మాధవి పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జుత్తాడలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను ఎంఇఒ యన్.జయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు బహుకరించిన వాటర్ కూలింగ్ కేన్‌లను ప్రారంభించారు. హెచ్‌ఎం వివి.శేషగిరిరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, సిఆర్‌పి కెవియమ్.నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక డైట్ కాలేజీలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంటరావు పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.స్థానిక గురజాడ హైస్కూల్లో విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు.స్కూల్ కరస్పాండెంట్ మల్ల యశోద దేవి, ప్రిన్సిపాల్ పీలా ఈశ్వరి దేవి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి హైస్కూల్‌లో సైన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్.కుమార్, అయానాల అప్పారావు, బోధపు నరసింహమూర్తి, వై నగేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జెడ్‌పి హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన చిట్టి ప్రయోగాలు, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం పిబిటి.సుందరి, ఉపాధ్యాయులు రామలక్ష్మి, పూర్ణిమ, సుజాత పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గాలిభీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలల్లో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఎంఇఓ-1 ఎస్.లక్ష్మణరావు, పాలిటెక్నినిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఆర్ నాగభూషణరావు సివి.రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బోకం అప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి.వి.ఎస్.ఎస్.శాస్త్రి సివి రామన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. గీతం యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ కె.వి. రమేష్, వైస్ ప్రిన్సిపల్ జి.జయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక కైట్స్ విద్యా విహార్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను డిఎస్‌పి కెవి సత్యనారాయణ సందర్శించి విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టుల ను పరిశీలించి, వాటి గురించి వివరాలు అడిగి తెలుస ుకున్నారు. పిల్లల శాస్త్రీయ విజ్ఞానాన్ని కొనియాడారు. బార్క్ శాస్త్రవేత్త సుబ్రజిత్ గుయ్న్, ఎంఇఒ దేవరాయలు, వైసిపినేతలు కోన బుజ్జి, కె విమలా నాయుడు కైట్స్ కాలేజీ కరెస్పాండంట్ రెడ్డి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


డావెన్సీ పాఠశాలలో సైన్స్‌డే ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో జాతీయ సైన్స్ డే ఉత్సవాలు మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ జెర్రిపోతుల రమణాజీ, ప్రిన్సిపల్ మీనా మిశ్రా, డిఎన్ సూరిబాబు ప్రారంభించారు. ఎండి సుందరయ్య మాట్లాడుతూ మానవ జీవితంలో తెలియని విషయాలు సైన్స్ తెలియజేస్తుందన్నారు

నక్కపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పరవాడ : పరవాడ సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. సైన్స్ ఆవశ్యకత, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు రూపాలి, రూపం, మోనాలిసా పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: శారదానగర్ శ్రీదుర్గ శాంతినికేతన్ కిడ్స్ క్యాంపస్‌లో నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఆర్డీవో హెచ్‌వి.జయరాం మాట్లాడుతూ, పిల్లల్లో ఇంత విజ్ఞానాన్ని నింపిన స్కూలు యాజమాన్యానికి అభినందించారు. పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి డి.గోపినాథ్, 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, కరస్పాండెంట్ జె.శిరీషరాణి పాల్గొన్నారు.

స్థానిక శ్రీచైతన్య ఆంగ్లమాధ్యమ పాఠశాలలో విశాఖపట్నం డిస్ట్రిక్ట్ లైన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, రిటైర్డ్ సైన్స్ ఉపాధ్యాయులు ఆనందరావులు సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రిన్సిపాల్ చిటికెల శ్రీను, సంస్థ ఏజిఎం సురేష్, ఆర్ఐ ఎం.రమణ, డీన్ వానపల్లి నాగేశ్వర రావు, ఇన్చార్జులు గోవిందరావు, మైథిలి, ప్రమీల పాల్గొన్నారు.

మాకవరపాలెం:మండలంలోని తూటిపాల ప్రాథమి కోన్నత పాఠశాలలో విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. హెచ్‌ఎం రాము పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని జోగుంపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో సివి.రామన్ చిత్రపటానికి హెచ్‌ఎం సరోజినీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రంపచోడవరం : స్థానిక ప్రభుత్వ శిక్షణా కళాశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు.కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్ చినబాబు, సిబ్బంది జి భాస్కర్ రావు, జె వెంకట లక్ష్మి, ఏం సామ్రాజ్యం, పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు సిహెచ్ వివిఎస్‌ఎన్ మూర్తి, ఎం శాంతిప్రియ, ఈ ఏసుకుమారి నేతృత్వంలో పాఠశాల విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల పిఎంసి చైర్మన్ చింతలపూడి వీరబాబు, ఉపాధ్యాయులు సిహెచ్ శివకృష్ణ, టి బోజ్జియ్య పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓం నమశివాయ, ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ కేకే వి ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్ ఏడిఈ వెంకట మధు పాల్గొన్నారు.